సాక్షి తిరుపతి

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025


తూపిలిపాళెం బీచ్‌లో గణేశుడిని నిమజ్జనం చేస్తున్న యువకులు

జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఐదో రోజు నయనానందకరంగా నిమజ్జనోత్సవం చేపట్టారు. మండపాల నుంచి గణపతి ప్రతిమలను ఊరేగింపుగా తరలించారు. సముద్రంతోపాటు నదులు.. చెరువులు.. కాలువలు.. బావుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లో గణనాథునికి విశేష పూజలు జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం తప్పెట్లు..తాళాల నడుమ వైభవంగా ఆదిదేవుడిని సాగనంపారు.

నయనానందం.. నిమజ్జనోత్సవం

- జిల్లాలో వేలాదిగా గణపతి విగ్రహాల నిమజ్జనం
- ఒక్క తిరుపతిలోనే తరలిన 740 ప్రతిమలు
- తూపిలిపాళెం బీచ్‌కు పోటెత్తిన భక్తులు
- ఊరూరా ఉత్సాహంగా ఊరేగింపులు


వినాయకసాగర్ లోకి క్రేన్‌తో జాగ్రత్తగా..


గణేష్ నిమజ్జనంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కమిషనర్ మౌర్య



తిరుపతి అర్బన్ : వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో గణపతి ప్రతిమలను నిమజ్జనం చేశారు. సాధారణంగా మండపంలో గణేశుని కొలువుదీర్చిన తర్వాత తొలిరోజు నుంచి 11 రోజులలోపు నిమజ్జనం చేస్తుంటారు. ప్రధానంగా ఐదోరోజున విగ్రహాల నిమజ్జనం అధికంగా ఉంటుంది. ఈ క్రమంలోనే జిల్లాలోని 90శాతం విగ్రహాలను మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో తమకు సమీపంలోని నీటి వనరుల్లో కలిపేశారు.

ఒక్కో నియోజకవర్గంలో సుమారు వెయ్యికి పైగానే..

జిల్లాలో 10వేలకు పైగా విగ్రహాలను మండపాల్లో కొలువుదీర్చినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అందులో తిరుపతి నగరంలోనే 3వేలకు పైగా విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. మిగిలిన ఒక్కో నియోజకవర్గంలో వెయ్యికి పైగా గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది.


తుమ్మలగుంట నిమజ్జనోత్సవంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


తుమ్మలగుంటలో ఉట్టి కొడుతున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తుమ్మలగుంటలో..

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన తుంబుర వినాయకుని నిమజ్జన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేపట్టారు. అనంతరం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవం నిర్వహించారు. నిమజ్జన వేడుకల్లో పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిలో నిమజ్జన సందడి


బీచ్‌లో సందడి

గూడూరు నియోజకవర్గంలోని పలు విగ్రహాలను వాకాడు మండలంలోని తూపిలపాళెం వద్ద బంగాళాఖాతంలో నిమజ్జం చేశారు. ఈ క్రమంలో వేలాది మంది భక్తులతో తూపిలిపాళెం బీచ్ కిక్కిరిసింది. అలాగే వెంకటగిరివాసులు కైవల్య నదిలో, సూళ్లూరుపేటకు చెందిన వారు కాళంగి నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. అలాగే శ్రీకాళహస్తివాసులు స్వర్ణముఖినది, తెలుగుగంగ కాలువతోపాటు సమీప ప్రాంతాల్లో చెరువుల్లోను, సత్యవేడు భక్తులు తెలుగుగంగ కాలువ, సమీప ప్రాంతాల్లోని చెరువుల్లో, చంద్రగిరి వారు దామినేడు, వినాయకసాగర్, పేరూరు తదితర ప్రాంతాల్లోను, తిరుపతి వాసులు వినాయకసాగర్, కొరమేనుగుంట, చెన్నాయిగుంట, మంగళం చెరువుల్లో ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు.


సూళ్లూరుపేటలో ఊరేగింపు


సత్యవేడులో తరలివెళుతున్న గణపయ్యలు


బైబై గణేశా..

న్యూస్‌రీల్

'తెలుగు తేజం'.. జగన్నాథం


అవార్డు అందుకుంటున్న పోలూరు జగన్నాథం

వరదయ్యపాళెం: జానపద కళాకారుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోలూరు జగన్నాథానికి అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక తెలుగుతేజం అవార్డును ప్రదానం చేసింది. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో ఆయన పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఈ మేరకు పలువురు ఉపాధ్యాయులు, అధికారులు అభినందనలు తెలిపారు.

జీవకోనలో ఎలుగుబంటి కలకలం!

తిరుపతి మంగళం : జీవకోనలోని జీవలింగేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో శనివారం అర్ధరాత్రి ఎలుగుబంటి సంచారం కలకలం రేపింది. ఎలుగు అరుపులు వినిపించాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎస్వీ జూపార్క్, ఎస్వీయూ ప్రాంతాలలో చిరుత సంచారంపై తిరుపతి వాసులు భయంతో వణికిపోయారు. జనావాసాల్లోకి వన్యప్రాణులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆదివారం దీనిపై ఫారెస్ట్ రేంజ్ అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యర్థాలు, ఫుడ్ వేస్ట్‌ను ఎక్కడపడితే అక్కడ పడేయంతో వాటిని తినేందుకు వన్యప్రాణులు వస్తున్నాయన్నారు. అటవీ ప్రాంతాల సమీపంలో వ్యర్థాలు వేయకూడదని పదే పదే చెబుతున్నా ప్రజలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్వీయూలో సంచరించిన చిరుతను పట్టుకున్నామన్నారు. ఈ క్రమంలోనే జీవకోనలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎలుగుబంటి కదలికలు గుర్తిస్తే వెంటనే బోను పెడతామని వివరించారు. రాత్రివేళల్లో స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైతు బజార్‌లో ఉల్లిగడ్డల కౌంటర్



తిరుపతి అర్బన్: తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రైతు బజార్‌లో ఉల్లిగడ్డల కౌంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఉల్లిగడ్డలు ప్రస్తుతం కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. అయితే రూ.5 సబ్సిడీతో కిలో రూ.15 చొప్పున కూరగాయల మార్కెట్‌లో అందిస్తున్నారు. ఒక్కో వ్యక్తికి రెండు కిలోల చొప్పున ఉల్లిగడ్డలను అందిస్తున్నట్లు రైతుబజార్ ఎస్టేట్ అధికారి యస్ఎన్ అనిల్‌కుమార్ తెలిపారు.

అధికార నందిపై అగస్తీశ్వరుడు

నారాయణవనం: మండలంలోని సముదాయంలో వెలసిన మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ఉత్సవర్లు అధికార నంది వాహనంపై విహరించారు. ఉదయం మూల, ఉత్సవమూర్తులకు పవిత్రాల సమర్పించారు. ఆలయంలో శుక్రవారం సాయంత్రం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం హోమశాలలో పట్టు పవిత్రాలకు ప్రత్యేక పూజలను, యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించిన రిత్వికులు పవిత్రాలను ఆలయంలోని మూల, ఉత్సవ విగ్రహాలకు, పరివార దేవతలకు పట్టు పవిత్రాలను సమర్పించారు. వార, పక్ష, వార్షిక ఉత్సవాలలో జరిగిన పొరబాట్లు, దోష నివారణార్థం పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. సాయంత్రం ఆదిదంపతులు అధికార నంది వాహనం అధిరోహించి ఊరేగుతూ కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు రమేష్ గురుకుల్, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు.


అధికార నందిపై అగస్తీశ్వరస్వామి

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 77,295 మంది స్వామివారిని దర్శించుకోగా 26,779 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.92 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మన ఉద్యమం.. రాష్ట్రానికే ఆదర్శం


సమావేశంలో మాట్లాడుతున్న భూమన, పక్కన ఎమ్మెల్సీ సిపాయి, మేయర్ శిరీష, అభినయ్‌రెడ్డి

- జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యంగా పనిచేద్దాం
- వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వ అరాచక పాలనపై తిరునగరి నుంచి అభినయ్ నేతృత్వంలో చేపట్టిన ఉద్యమం.. రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నేతలతో సమావేశం నిర్వహించారు. భూమన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఐదేళ్ల సంక్షేమ పాలనతో జగనన్న రూ.3లక్షల కోట్లను పేదలకు అందించారని కొనియాడారు. జగనన్నపై తోడేళ్ల కూటమి విష ప్రచారం చేసి, నోటికి వచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. కక్షపూరిత రాజకీయాలతో అరాచక పాలన సాగిస్తున్న చంద్రబాబు ప్రజాద్రోహి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో జగనన్న సారథ్యంలో పనిచేయడం అదృష్టమన్నారు. మేయర్ శిరీష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలు రగిలిపోతున్నారని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నగరాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేశామన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల కారణంగానే తిరుపతిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైందని తెలిపారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తుడా సర్కిల్‌లో వైఎస్సార్ వర్ధంతి

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం ఉదయం 9 గంటలకు తుడా సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

- తిరుపతి లక్ష్మీపురంలోని ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్‌పర్సన్ హేమలత అవినీతి బాగోతం జూలై 12వ తేదీన వెలుగులోకి వచ్చింది. పొదుపు సొమ్ముతోపాటు లోన్ రికవరీ నగదు నుంచి రూ.70 లక్షలకు పైగా ఆమె చాకచక్యంగా కాజేసింది. డ్వాక్రా సభ్యుల డబ్బులను యథేచ్ఛగా మెక్కేసినా.. సదరు బ్యాంకు, మెప్మా అధికారులు ఇప్పటివరకు పైసా కూడా కక్కించలేకపోయారు. 33 సంఘాలకు సంబంధించిన మొత్తం దిగమింగేసినా.. కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. ఆర్పీ హేమలతపై కేవలం కేసు నమోదు చేయించి చేతులు దులుపేసుకున్నారు.
- అదే తిరుపతి నగరంలోని సంజయ్ గాంధీ కాలనీలో ఒక సమాఖ్య బాధ్యతలను నిర్వహిస్తున్న రిసోర్స్‌పర్సన్ నౌహీరా రూ.60 లక్షల మేర చేతివాటం చూపినట్లు ప్రాథమికంగా నిర్ధారణైంది. వారం క్రితం నౌహీరా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆమె పరిధిలోని పొదుపు నిల్వలు, రుణ చెల్లింపుల సొమ్మును కాజేసింది. అయితే మెప్మా అధికారులు విషయం బయటకు పొక్కకుండా రహస్యంగా ఆర్పీని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు 26వ డివిజన్‌లోని ఒక ఆర్పీ రూ.30లక్షల మేర స్వాహా చేసినప్పటికీ అధికారులు చోద్యం చూడడం తప్ప చేసిందేమీ లేదు. కఠిన చర్యలు లేకపోవడంతో అవినీతి ఆర్పీలు రెచ్చిపోతున్నారు. డ్వాక్రా మహిళలు తీవ్రంగా నష్టపోతున్నారు.



ఆందోళనలో సభ్యులు

ఆర్పీలను నమ్మి పొదుపు, రుణ చెల్లింపుల మొత్తాలను నెలవారీగా కచ్చితమైన తేదీలలో డ్వాక్రా మహిళలు చెల్లిస్తున్నారు. ఇలా వచ్చిన నగదును కొందరు ఆర్పీలు చాకచక్యంగా కాజేస్తున్నారు. వరుసగా ఐదుగురు ఆర్పీల అక్రమాలు బయటపడడంతో డ్వాకా సంఘాల సభ్యులు ఆందోలన చెందుతున్నారు. తమ పొదుపు, రుణ చెల్లింపుల సొమ్ము భద్రమేనా అంటూ హైరానా పడుతున్నారు. లావాదేవీల వివరాలను పొదుపు మహిళలు అడిగితే మెప్మా, బ్యాంకుల్లో సమాధానం చెప్పేవారే కరువయ్యారు. నెలవారీగా చెల్లిస్తున్న నగదు సక్రమంగా బ్యాంకులో జమవుతోందా..? అనే అనుమానాలు ఎక్కువవుతున్నాయి. ఎంతోమంది మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు మంత్రం పఠిస్తున్నారు. తీసుకున్న రుణాలను తిరిగి వడ్డీతో సహా చెల్లిస్తున్నారు. అవినీతి ఆర్పీల కారణంగా డ్వాక్రా సంఘాల్లో తమ నగదుకు ఏమాత్రం భద్రత లేదనే అనుమానం మహిళల్లో వ్యక్తమవుతోంది.



అసలుకు ఎసరు!

డ్వాక్రా సంఘాల నగదుకు భద్రత కరువు

- మెప్మాను కమ్మేసిన అవినీతి చీడలు
- వరసగా వెలుగు చూస్తున్న అక్రమాలు
- రూ.లక్షలు కాజేస్తున్న కొందరు ఆర్పీలు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో పొదుపు మహిళలు

తిరుపతి తుడా: తిరుపతి మెప్మాలో అవినీతి తిమింగలాల బాగోతాలు ఒక్కొక్కటే వెలుగులోకి వస్తున్నాయి. కొంతమంది రిసోర్స్ పర్సన్లు వివిధ మార్గాల్లో డ్వాక్రా సంఘాల సభ్యుల సొమ్మును నొక్కేస్తున్నారు. అందులో కొంత మొత్తాన్ని మెప్మా అధికారులు, రాజకీయ నేతలు ముట్ట చెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే అవినీతి ఆర్పీలపై చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్వాక్రా సొమ్ము కాజేస్తే అడిగేవారు లేరు అన్నట్లు మెప్మా అధికారులే భరోసా కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల మెప్మాలో అవినీతి పరులు రెచ్చిపోతున్నారు. ఆమె తినేసింది.. నేను మాత్రం మేసేయకూడదా అంటూ అమాయక మహిళలకు చెందిన రూ.లక్షలను పోటాపోటీగా స్వాహా చేసేస్తున్నారు. ఈ మేరకే అవినీతి ఆర్పీలు కాజేసిన ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తిరుపతి మెప్మాలో టీఎల్ఎఫ్ -4 (టౌన్ లెవెల్ ఫెడరేషన్), ఎస్ఎల్ఎఫ్-167 (స్లమ్ లెవెల్ ఫెడరేషన్) పరిధిలో 4,375 పైగా డ్వాక్రా సంఘాలు ఉన్నాయి సుమారు 44 వేల మంది సభ్యులుగా ఉన్నారు. ఒక్కో ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 30 నుంచి 40 సంఘాలు ఉంటాయి. వీటి పర్యవేక్షణకు ఆర్పీ (రిసోర్స్ పర్సన్) ఉంటుంది. ప్రభుత్వం నుంచి వీరికి ప్రతి నెలా రూ.10వేల ఆర్థిక సహాయం అందుతుంది. మళ్లీ డ్వాక్రా సంఘ సభ్యుల నుంచి నెలవారీగా కొంత నగదును వసూలు చేసుకుంటూ ఉంటారు. అయినప్పటికీ కొందరు ఆర్పీలు అసలుకే ఎసరు పెట్టేందుకు తెగబడుతున్నారు. తోటి మహిళల పొదుపు సొమ్ము అని కూడా చూడకుండా రూ.లక్షల్లో తినేస్తున్నారు.

చర్యలు లేకపోవడంతోనే...

డ్వాక్రా సంఘాల సొమ్మును కొట్టేస్తున్న ఆర్పీలపై కఠిన చర్యలు లేకపోవడంతో వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అవినీతి ఆర్పీలను ఆదర్శంగా తీసుకుని మరింత మంది అక్రమాలకు పాల్పడేందుకు పోటీపడుతున్నారు. ఆధారాలతో ఆర్పీల అవినీతి బయటపడినా, సొమ్ము రికవరీ విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కేసులు నమోదు చేయించి శిక్ష పడేలా చేయడంలో మెప్మా అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఆర్పీల అవినీతి మరకలు తమకు అంటుకోకూడదనే చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డ్వాక్రా సంఘాల నగదు తినేసిన ఆర్పీల ఆస్తులను రికవరీ చేసుకునేలా ఎందుకు చర్యలు చేపట్టడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీంతో తిరుపతిలో మెప్మా ప్రతిష్ఠ మసకబారుతోంది. ఉన్నతాధికారులు సైతం రెండు రోజులు హంగామా చేసి, తర్వాత అవినీతిపరులతో చేతులు కలుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆడిట్‌పైనా అనుమానం

డ్వాక్రా సంఘాల లావాదేవీలకు సంబంధించి ఏటా ఆడిట్ నిర్వహిస్తున్నారు. అయినా అవినీతి, అక్రమాలు మాత్రం వెలుగు చూడడం లేదు. అవినీతిని డ్వాక్రా సంఘాల సభ్యులు గుర్తిస్తున్నారే కానీ, ఆడిట్‌లో మాత్రం ఒక్కటీ బయటకు రావడం లేదు. దీంతో ఆడిట్ వ్యవహారంపై సైతం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మెప్మా అధికారులతో పాటు ఆడిట్ సిబ్బందిని సైతం అవినీతి తిమింగలాలు మాయ చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భక్తితోనే భగవంతుని అనుగ్రహం


ఆదిభట్లకు పుష్పాంజలి ఘటిస్తున్న సంగీత కళాశాల ప్రిన్సిపల్, హిందూధర్మప్రచార పరిషత్ ప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న మేడసాని మోహన్

తిరుపతి కల్చరల్: భగవంతుని అనుగ్రహం పొందడానికి భక్తి ఒక్కటే మార్గమని మేడసాని మోహన్ తెలిపారు. మహతి కళాక్షేత్రంలో ఆదివారం టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదిభట్ల నారాయణదాసు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హరి అంటే చేసిన పాపాలు పటాపంచలు అవతాయని తెలిపారు. భక్తుల్లో ప్రథమ స్థానంలో ప్రహ్లాదుడు ఉన్నాడని తెలిపారు. భాగవతులు వై.వెంకటేశ్వర్లు, భాగవతారిణి వరలక్ష్మి మాట్లాడుతూ హరికథా గానం ద్వారా ధర్మ ప్రచారాన్ని వివరించారు. హరికథా పితామహులు ఆదిభట్ల నారాయణదాసు జీవిత విశేషాలను తెలియజేశారు. భాగవతులు ఎంవీ.సింహాచల శాస్త్రి, పరాయితం నారాయణచార్య భాగవతులు ప్రసంగించారు. హిందూ ధర్మప్రచార పరిషత్ కథకులు ఎం.రాముడు పార్వతి కల్యాణం, వెంకటేశ్వర్లు గజేంద్ర మోక్షం గానం చేశారు. ఎస్వీ సంగీత కళాశాల ఆవరణలోని ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల, డీపీపీ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆదిభట్ల చిత్రపటంతో ఊరేగింపుగా మహతి కళాక్షేత్రానికి చేరుకున్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్ డిప్యూటీ సెక్రటరీ రాంగోపాల్, ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి, ఏఈవో సీహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా అధికారులతోపాటు అన్ని విభాగాలకు చెందిన అధికారులు హాజరుకానున్నారు. అర్జీదారులు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల్లోపు హాజరు కావాల్సి ఉంది. గ్రీవెన్స్ ప్రారంభం నుంచి ముగింపు వరకు అందుబాటులో ఉండాలని ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తుంది.

ట్రాక్టర్ బోల్తా

– 9 మంది భక్తులకు గాయాలు



స్వర్ణముఖి నదిలో బోల్తాపడిన ట్రాక్టర్

వాకాడు: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకుని ఆదివారం వాకాడు మండలం, తూపిలిపాళెం సముద్ర తీరానికి నిమజ్జనానికి వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన తొమ్మిది మంది భక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. వాకాడు మండలం, కాశీపురం గ్రామానికి చెందిన దాదాపు 26 మంది భక్తులు ఉత్సాహంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. తర్వాత ట్రాక్టర్‌పై విగ్రహాన్ని తీసుకుని సముద్రంలో నిమజ్జనం చేసేందుకు తూపిలిపాళెం బయలుదేరారు. గ్రామం నుంచి బయలుదేరిన ట్రాక్టర్ 20 నిమిషాలు కాకముందే అదుపుతప్పి స్వర్ణముఖి నది కరకట్టపై నుంచి నదిలోపల ముళ్లపొదల్లోకి తీరగబడింది. ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న భక్తుల్లో తొమ్మిది మంది గాయపడ్డారు. క్షతగాత్రులు శివ, సుశాంత్, సాయి, ధోని, కిషోర్, అనిల్, పవన్, నాగేంద్ర, తరుణ్‌ను వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో విద్యుర్థులే ఎక్కువ మంది ఉన్నారు.



వాకాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

ఏడు దశాబ్దాల ఎస్వీయూ

అత్యున్నత ప్రమాణాలు.. అత్యాధునిక వసతులు.. అత్యుత్తమ బోధనా విధానాలు తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ సొంతం. ఎందరో ఉద్దండులను దేశానికి కానుకగా అందించిన ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం. రాయలసీమకు తలమానికంగా విరాజిల్లుతున్న ఎస్వీయూ మంగళవారంతో ఏడు దశాబ్దాలను పూర్తి చేసుకుని 71వ వసంతంలోకి అడుగుపెడుతోంది. మద్రాసు యూనివర్సిటీకి అనుబంధంగా మొదలై.. 1954 సెప్టెంబర్ 2వ తేదీన టంగుటూరి ప్రకాశం పంతులు కృషితో స్వతంత్ర విశ్వవిద్యాలయంగా ప్రస్థానం ప్రారంభించింది. టీటీడీ నుంచి 99 ఏళ్లకు లీజుకు తీసుకున్న 904 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కార్యకలాపాలకు శ్రీకారం చుట్టింది. తొలుత ఆరు మేజర్ విభాగాలతో ఆరంభించి.. ప్రస్తుతం 52 విభాగాలతో 60 కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. సుమారు 6 వేల మంది విద్యార్థులకు ఉన్నత చదువులను అందిస్తోంది. ఇప్పటికే నాక్ ఏ గ్రేడ్ పొందింది. త్వరలోనే ఏ ప్లస్ గ్రేడ్ సాధించే దిశగా అడుగులు వేస్తోంది.

- 71వ వసంతంలోకి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ
- ఎందరో మహానుభావులను దేశానికి అందించిన ఉన్నత విద్యాలయం
- రేపే వర్సిటీలో వ్యవస్థాపక దినోత్సవం



విద్యుద్దీపకాంతులీనుతున్న ఎస్వీయూ పరిపాలన భవనం

తిరుపతి సిటీ : తిరునగరంలోని ప్రతిష్టాత్మక ఎస్వీ యూనివర్సిటీ 71వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. వర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో వేడుకను జరిపించేందుకు నాన్ టీచింగ్ స్టాఫ్ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఎస్వీయూ పరిపాలన భవనాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ క్రమంలోనే ఉద్యోగుల క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు వ్యవస్థాపక దినోత్సవం రోజున బహుమతులు పంపిణీ చేయనున్నారు. అలాగే వర్సిటీలోని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

సమస్యలు ఇవీ..

- వర్సిటీ బ్యూటిఫికేషన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్ నిర్మించాలి.
- తెలుగుగంగ నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలి.
- ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ ఏర్పాటు చేయాలి.
- సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే పరిశోధనలకు పెద్ద పీట వేయాలి.
- ఆర్టికల్స్, శోధనాపత్రాలు సమర్పించేందుకు విద్యార్థులకు ప్లాగరిజమ్ టెస్ట్, ఫారిన్ ఎగ్జామినేషన్ ఏర్పాటు చేయాలి
- తొలగించిన అకడమిక్ కన్సల్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలి.
- ఇంజినీరింగ్ విద్యార్థులకు అధునాతనమైన ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకురావాలి.
- దూరవిద్యా కేంద్రం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి.
- త్వరితగతిన ఫలితాలు విడుదల చేసేందుకు కృషి చేయాలి.
- టైంస్కేల్, ఎన్ఎమ్ఆర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి.
- బోధన, బోధనేతర విభాగాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.
- విద్యార్థులకు హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలి.

ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్



యూనివర్సిటీలలో ఎస్వీయూ అంటే ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ ఉంది. సామాన్య విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చిన విద్యాలయం ఇది. ఎంతో మంది ముఖ్యమంత్రులను, మంత్రులను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు, సివిల్ సర్వెంట్లను, అధికారులను అందించిన విద్యా సంస్థకు వీసీగా సేవలందించడం సంతోషంగా ఉంది. ఎస్వీయూలో విద్యనభ్యసించిన విద్యార్థి నిరుద్యోగిగా మారకూడదనే ఉద్దేశంతో ఉపాధి కల్పన దిశగా బోధనా పద్ధతులను తీసుకువస్తున్నాం. జాతీయ విద్యావిధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం.

– సీహెచ్ అప్పారావు, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్

వర్సిటీ అభివృద్ధే లక్ష్యం



ఎస్వీయూను దేశంలోనే ప్రథమస్థానంలో నిలపడమే మా లక్ష్యం. వర్సిటీలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఉపాధి, ఉద్యోగాల కల్పన దిశగా పనిచేస్తున్నాం. వర్సిటీ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తాం.

– భూపతినాయుడు, రిజిస్ట్రార్

ఉద్యోగుల కృషి ఎనలేనిది



ఎస్వీయూ మరింత అభివృద్ధి చెందేందుకు ఉద్యోగ సంఘాల తరపున కృషి చేస్తాం. రాయలసీమకే తలమానికమైన వర్సిటీలో ఉద్యోగ సంఘం అధ్యక్షుడుగా పని చేయడం గర్వంగా ఉంది. వర్సిటీలో అభివృద్ధిలో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల కృషి ఎనలేనిది. సిమంగళవారం వర్సిటీలో వార్షికోత్సవం ఘనంగా జరుపుతున్నాం.

– జి.శ్రీధర్, అధ్యక్షుడు, నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

సమష్టి కృషే బలం



వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నాం. ఉద్యోగుల సమష్టి కృషే బలంగా రాయలసీమలోనే అత్యుత్తమంగా ఎస్వీయూ కొనసాగుతోంది. ఉద్యోగులు వర్సిటీకి మూలస్తంభాలుగా నిలవడం గర్వకారణం. వర్సిటీని మరింత ఉన్నత స్థాయి చేర్చేందుకు మా వంతు కృషి చేస్తాం.

– సుబ్రమణ్యం, సెక్రటరీ, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

శేషవాహనంపై 'విఘ్న' విహారం

కాణిపాకం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి స్వర్ణ చిన్న, పెద్ద శేషవాహన సేవల్లో విహరించారు. వాహన సేవల్లో విహరించిన విఘ్నేశ్వరుడుని అశేష భక్తజనం దర్శించి పునీతులయ్యారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం సిద్ధి, బుద్ధి, సమేత వరసిద్ధి వినాయకస్వామి స్వర్ణ చిన్న, పెద్ద శేష వాహనంపై అభయమిచ్చారు. అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత గౌరీ సుతుడికి విశేషాలంకరణ చేసి చిన్న శేష వాహనంలో కొలువుదీర్చారు. మేళతాళాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పురవీధుల్లో వేడుకగా ఊరేగించారు.

రాత్రి స్వర్ణ పెద్ద వాహనంలో కనువిందు

ఉభయకర్తలు, ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వర్ణ పెద్ద శేష వాహనంలో కొలువుదీర్చారు. కోలాటాలు, చెక్క భజనల నడుమ పెద్ద శేష వాహన సేవ చేపట్టారు. కమ్మ సామాజిక వర్గీయులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేడు చిలుక, వృషభ వాహన సేవ

కాణిపాకం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం చిలుక, వృషభ వాహన సేవల్లో స్వామి వారు విహరిస్తున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం చిలుక వాహన సేవ, రాత్రి వృషభ వాహన సేవ ఉంటుందన్నారు. ఈ సేవకు ఉభయదారులుగా కాణిపాకం ఆర్యవైశ్యులు, కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లి, ముదిగోళం, చిత్తూరు, శాలివాహన వంశస్థులు వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.



శేష వాహనంపై ఊరేగుతున్న వరసిద్ధుడు



అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసులకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన టెంపో ట్రావెల్ వాహనం



గాయాలతో రోడ్డుపై కూర్చొని ఉన్న భక్తులు

రేణిగుంట: మండలంలోని కడప–చెన్నై ప్రధాన రహదారి మామండూరు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రేణిగుంట వైపు నుంచి వెళ్తున్న లారీ కడప వైపు నుంచి వస్తున్న ట్రావెల్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కర్ణాటకకు చెందిన వాహనంలో ఉన్న డ్రైవర్‌తోపాటు మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు. కర్ణాటక రాష్ట్రం, బళ్లారికి చెందిన తిరుమల శ్రీవారి దర్శనార్థం వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతబడి చేశాడనీ..!

- ఓ వ్యక్తి దారుణ హత్య
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్: చేతబడి చేసి, ఇద్దరి చావుకు కారకుడయ్యాడన్న అనుమానంతో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ హత్యకు కారకులైన నిందితులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఏవీ.రమణ ఆ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. వెంకటగిరి రూరల్ మండలం, అమ్మపాళెం గ్రామానికి చెందిన అటుపాక శివయ్య(25)కు అదే గ్రామానికి చెందిన మునిజానకీరామ్, సాయికుమార్ మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఇందులో భాగంగా మునిజానకీరామ్ తండ్రి మునిస్వామిని చేతబడి చేసి చంపేశారని, దీనికి శివయ్యే కారణమని భావించారు. అంతేగాకుండా పొలూరు సాయికుమార్ సోదరి మృతి చెందగా.. ఆమెను కూడా శివయ్య చేతబడి చేసి చంపేసి ఉంటాడని ప్రత్యర్థులు అనుమానించారు. ఈ మేరకు శివయ్యకు భయపడి మునిజానకీరామ్ అమ్మపాళెం గ్రామాన్ని విడిచి శ్రీకాళహస్తి మండలంలోని ఓ గ్రామానికి వలస వెళ్లాడు. అయితే మునిజానకీరామ్ కుటుంబంలో మరొకరు అనారోగ్యానికి గురికావడంతో దానికి శివయ్యనే మళ్లీ చేతబడి చేశారన్న అనుమానంతో అతన్ని హత్య చేయాలని పథకం పన్నారు. ఈ మేరకు మునిజానకీరామ్, సాయికుమార్ పట్టణంలోని తన ఫొటో స్టూడియో వద్ద ఉన్న శివయ్యను తీసుకుని మద్యం తాగించేందుకు బయల్దేరారు. ముందుగా సాయికుమార్ తన ద్విచక్ర వాహనంపై ఈనెల 26న రైల్వేస్టేషన్ జామాయిల్ తోటల వద్దకు శివయ్యను తీసుకువెళ్లారు. ఆ తర్వాత మరో బైక్‌పై మునిజానకీరామ్ కుడా ఘటనా స్థలికి చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న శివయ్యపై వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డు, కర్రతో తలపై గట్టిగా మోదారు. శివయ్య రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా పక్కనే ఉన్న మద్యం బాటిల్‌తో తలపై గట్టిగా మోదారు. పగిలిన మద్యం బాటిల్‌ను తీసుకుని విచక్షణా రహితంగా గొంతుపై పొడిచారు. ఆపై మృతి చెందే వరకు అక్కడే ఉన్నారు. అనంతరం మృతదేహాన్ని చెట్ల మధ్యలో పడేశారు. ఈ మేరకు నిందితులు శ్రీకాళహస్తి నుంచి వెంకటగిరికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెంకటగిరి ఎస్ఐ ఏడుకొండలు తన సిబ్బందితో వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

రూ.160 బాకీ అడిగినందుకు కత్తితో దాడి



కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన నరసయ్య



బాధితుడిని అడిగి వివరాలు తెలుసుకున్న సీఐ బాబీ

నాయుడుపేట టౌన్: ఇవ్వాల్సిన బాకీ రూ.160 అడిగినందుకు మద్యం మత్తులో కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి పట్టణ పరిధిలోని గాంధీ పార్కు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. పట్టణానికి చెందిన అవధాని నరసయ్య, అతనితో ఉండే సురేందర్ రెడ్డి ఇద్దరూ కలిసి ఆదివారం రాత్రి మద్యం సేవించారు. అయితే నరసయ్యకు సురేందర్‌రెడ్డి రూ.160 బాకీ ఉండగా ఆ నగదు ఇవ్వాలని కోరాడు. దీంతో కోపోద్రేక్తుడైన సురేందర్‌రెడ్డి కత్తి తీసుకుని దాడి చేసి నరసయ్యను తీవ్రంగా గాయపరిచాడు. గాంధీ పార్కు సమీపంలో రక్తపు మడుగులో పడి ఉన్న అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ బాబి ఆస్పత్రికి చేరుకుని బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్ఎంపీల వైద్యం..ప్రాణాలు పణం

- స్థాయికి మించి వైద్య చికిత్సలు
- క్లినిక్, బెడ్స్ ఏర్పాటు చేసి ట్రీట్‌మెంట్
- విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్ వినియోగం
- తూతూ మంత్రంగా పర్యవేక్షణ



విజయపురం : కొంత మంది ఆర్ఎంపీలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని అంతకు మించి వైద్యం అందించకూడదని నిబంధనలు ఉన్నాయి. అయితే వాటిని ఎవరూ పాటించడం లేదు. వచ్చీరాని వైద్యంతో తెలిసీ తెలియని చికిత్సలతో ప్రాణాలను హరిస్తున్నారు. అన్ని వ్యాధులకు ఒకే మందు అన్నట్లు వచ్చిన ప్రతి బాధితుడికి ఓ రెండు రకాల సూది మందులు, ఎర్ర, పచ్చ, తెల్లది అంటూ మరో మూడు మాత్రలు ఇచ్చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేలు ఆర్ఎంపీ క్లినిక్‌లు ఉన్నాయి. ఈ క్లినిక్‌లలో రోగులకు ప్రథమ చికిత్స చేసేందుకే పరిమితం కావాల్సిన ఆర్ఎంపీ, పీఎంపీలు తమ పరిధి దాటి వైద్యం చేస్తున్నారు. అర్హత లేకపోయినా క్లినిక్‌లు, బెడ్స్ ఏర్పాటు చేసి ట్రీట్‌మెంట్ చేస్తూ తమ ఇష్టం వచ్చినట్లుగా మందులు వాడుతూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొంద రైతే ల్యాబ్, మెడికల్ షాప్స్ నిర్వహించడమే కాకుండా గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. వీరి నిర్లక్ష్యంతో ఎక్కడో ఒక చోట బాధితులు ప్రాణాలనే కోల్పోతూనే ఉన్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఆర్ఎంపీలు మాత్రం తీరు మార్చుకోవడం లేదు. మరోవైపు తక్కువ ఖర్చులో ఇంటికి సమీపంలో వైద్య సేవలు అందుతాయనే భావనతో ఏ వ్యాధికైనా ఆర్ఎంపీలనే సంప్రదిస్తుండటం చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకోవడం పరిపాటిగా మారిపోయింది.

ల్యాబ్‌లు, మెడికల్ షాపులు ఏర్పాటు చేసి..

నిబంధనల మేరకు ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స చేసేందుకే పరిమితం కావాలి. తమ సెంటర్‌లో ప్రథమ చికిత్స కేంద్రం అని బోర్డు మాత్రమే పెట్టుకోవాలి. కానీ చాలామంది ప్రవేటు ఆసుపత్రి తలపించేలా క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అందులో నాలుగైదు బెడ్స్ ఏర్పాటు చేసి, తామే డాక్టర్‌గా చలామణి అవుతూ రోగులకు ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. గ్రామాల్లో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఎక్కువగా ఆర్ఎంపీ, పీఎంపీలపైనే ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా భావించిన వీరు పసి పిల్లల నుంచి పండు ముసలి వరకు పెయిన్ కిల్లర్స్, యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నారు. వీటి వల్ల ఉన్న రోగం తగ్గకపోగా కొత్తగా రావడం, బీపీ పెరగడం, తగ్గడం, తల తిరగడం, వాంతులు, ఒంటి నొప్పుల వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో కొందరి ప్రాణాలే గాలిలో కలిసిపోతున్నాయి. మరికొందరు ఎలాంటి అర్హతలు లేకున్నా ల్యాబ్‌లు ఏర్పాటు చేసి అన్ని రకాల టెస్టు, మెడికల్ షాపులు పెట్టి మందులు అమ్ముతూ తమ జేబులు నింపుకుంటున్నారు. కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా ఎంపీటీ కిట్లు వాడుతూ అబార్షన్లు సైతం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్ఎంపీలపై పలు కేసులు నమోదైనట్లు మెడికల్ కౌన్సిల్ చెబుతున్నా ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కేసు నమోదైతే పేరును మార్చి మళ్లీ మరో పేరుతో కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు. పరిధిని దాటి శస్త్రచికిత్సలు సైతం చేసేస్తున్నారు.

పట్టించుకోని వైద్యాధికారులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నగరి నియోజకవర్గం విజయపురం మండలంలో సుమారు 15కి పైగా ఆర్ఎంపీ క్లినిక్‌లు ఉన్నాయి. ఒక పన్నూరు సబ్ స్టేషన్‌లోనే 7కు పైగా ఆర్ఎంపీ క్లినిక్‌లు ఉండగా అందులో ఓ ఆర్ఎంపీ క్లినిక్ 24 గంటలు జనంతో కిటకిటలాడుతూ ఉంటుంది. అక్కడ బెడ్ ఏర్పాటు చేసి సెలైన్లు పెట్టి ట్రీట్మెంట్ అందిస్తున్నారు. పక్కనే మెడికల్ షాపు ఉంది. రెండు దశాబ్దాలుగా వైద్యం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

జరిగిన ఘటనలు మచ్చుకు కొన్ని ఇలా..

- ఇటీవల తమిళనాడు పళ్లిపట్టు సమీపం నివసించే 17 ఏళ్ల వయస్సుగల అమ్మాయి గర్భం దాల్చగా విజయపురం మండలం పన్నూరులో ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా అబార్షన్ చేశారు. కొన్నాళ్లకే ఆమె ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే మార్గంలో మృతి చెందింది. ఆర్ఎంపీపై పళ్లిపట్టు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.
- గతంలో నగరి మండలంలో గర్భస్రావం కోసం ఒక యువతి ఆర్ఎంపీని సంప్రదించింది. ఆ సమయంలో గర్భస్రావం చేయకూడదని తెలిసినా ఆర్ఎంపీ సూది మందు ఇవ్వడంతో అది వికటించింది. ఆపై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు.

భగ్గుమన్న పాత కక్షలు

- యువకుడి దారుణ హత్య
- మరో ముగ్గురికి కత్తిపోట్లు
- ఒకరి పరిస్థితి విషమం



చందు మృతదేహాన్ని చూసి రోదిస్తున్న తల్లి, బంధువులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హేమంత్, సుధాకర్, అశోక్



చందు (ఫైల్)

తిరుపతి క్రైమ్/తిరుపతి తుడా : తిరుపతి నగరంలో పాత కక్షలు భగ్గుమన్నాయి. శనివారం రాత్రి కొర్లగుంట సుభాష్‌నగర్‌లో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి హత్యకు గురయ్యాడు. వివరాలు.. కొర్లగుంటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హేమంత్‌కు అదే ప్రాంతంలో నివసించే ఆటో డ్రైవర్ అశోక్‌కు గతంలో పలుమార్లు గొడవలు జరిగాయి. తన అక్కను అశోక్ ఏడిపించాడని హేమంత్ మండిపడేవాడు. ఈ క్రమంలో పరస్పరం ఎదురైనప్పుడు ఇద్దరూ ఘర్షణకు దిగేవారు. ఇదే విధంగానే శనివారం రాత్రి హేమంత్‌తోపాటు ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న చందు, సుధాకర్ రోడ్డుపై వెళుతుండగా మద్యం మత్తులో ఉన్న అశోక్ ఎదురుగా వచ్చాడు. ఆటోలో నుంచి కత్తి తీసుకుని దాడికి దిగాడు. భయంతో పరుగులు తీస్తున్న వెంటాడి కత్తితో పొడిచాడు. ఇంతలో హేమంత్ కూడా అశోక్ చేతిలోని కత్తిని లాక్కుని ప్రతి దాడి చేశాడు. గొడవను గమనించిన స్థానికులు పెద్దసంఖ్యలో చేరుకోవడంతో అందరూ ఘటనాస్థలం నుంచి పరారయ్యారు. అయితే కత్తిపోటు కారణంగా తీవ్రంగా గాయపడిన చందు(22) మాత్రం అక్కడే పడిపోవడతో స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. హేమంత్, సుధాకర్ చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రిలో చేరారు. అదే సమయంలో రక్తపు గాయాలతో అశోక్ కూడా రుయాకు చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. స్థానికులు కల్పించుకుని గొడవ పెద్దది కాకుండా సర్దిచెప్పారు. ఈ క్రమంలో అశోక్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

మిన్నంటిన రోదనలు

తిరుపతి తుడా : కత్తిపోట్ల ఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థి చందు మరణించగా, మరో ముగ్గురు రుయా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. రుయా మార్చురీలో చందు మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. చందు తల్లిదండ్రులు, బంధుమిత్రుల రోదనలతో రుయా ఆస్పత్రి వద్ద విషాదవాతావరణం నెలకొంది. అనంతరం చందు మతదేహాన్ని మహాప్రస్థానం వాహనంలో సొంత ఊరు రాయచోటికి తీసుకెళ్లారు.

రుయాలో అలజడి

దాడి ఘటనలో తీవ్రంగా గాయపడ్డ హేమంత్, సుధాకర్, అశోక్‌కు వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. అయితే చందు, హేమంత్, సుధాకర్ స్నేహితులు, స్థానికులు శనివారం అర్ధరాత్రి పదుల సంఖ్యలో రుయాకు చేరుకున్నారు. చికిత్స పొందుతున్న అత్యవసర విభాగంలోకి చొరబడడంతో గందరగోళం ఏర్పడింది. అశోక్ పై దాడి చేసేందుకు పలువురు యత్నించారు. చేతిలో ఉన్న పెన్ తో అశోక్‌ను ఎవరో పొడిచారని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన రుయాకి చేరుకుని ఆదివారం మధ్యాహ్నం వరకు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

కత్తిపోట్లు, ఒకరి మృతి ఘటనలో ఈస్టు పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. చందు తండ్రి గుమ్మలి నాగరాజు ఫిర్యాదు మేరకు.. అశోక్ హత్య కేసు నమోదు చేయగా.. అశోక్ భార్య అశ్విని ఫిర్యాదు మేరకు.. హేమంత్, సుధాకర్‌పై హత్యాయత్నం కేసు నమోదు పెట్టారు.